


జగన్ పాలనలో ప్రధాన సంస్థలు రాష్ట్రాన్ని విడిచిపెట్టగా, కూటమి ప్రభుత్వం గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఐబీఎం వంటి దిగ్గజాలను ఆకర్షిస్తోంది. పెట్టుబడిదారుల విశ్వాసం పెంచుతూ, గత ఆర్థిక నష్టాల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


గురువారం 26.03.2026

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 338 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అమరావతికి రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత !



**28న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం**

**కేంద్రానికి తీర్మానం పంపేందుకు సిద్ధం**

**ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే రాజధానిపై తుది నిర్ణయం !**

2లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి రాజధానికి చట్టబద్ధతతో పాటు చట్ట భద్రత కల్పించే దిశగా రాష్ట్రప్రభుత్వం వేగంగా ముందడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 28న రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అసెంబ్లీలో చర్చ అనంతరం ఆ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. తదనంతరం కేంద్ర కేబినెట్ ఆమోదం తీసుకుని, ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**విభజన చట్ట సవరణకు కేంద్రం చర్యలు :** ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 5(2)కు సవరణ చేయాలని కేంద్రం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. ఈ ప్రతిపాదనకు న్యాయశాఖ ఆమోదం లభించినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం అందిన తర్వాత కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అనంతరం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత, అమరావతిని అధికారికంగా ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**అమరావతి ఉద్యమం నుంచి పునర్జీవం వరకు :** విభజన అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది. 29 గ్రామాల రైతులు స్వచ్ఛందంగా సుమారు 34 వేల ఎకరాల భూమిని సమీకరించారు. సింగపూర్ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించబడింది.

అయితే 2019లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి పనులు నిలిచిపోయాయి. మూడు రాజధానుల ప్రతిపాదనతో పరిస్థితి మారింది. దీనికి వ్యతిరేకంగా రైతులు దీర్ఘకాలిక ఉద్యమం చేపట్టి తమ డిమాండ్లను కొనసాగించారు.

## నవమికి ముందే రాములోరికి గిరి ప్రదక్షిణ సుమమాల

- రామతీర్థంలో నాటి వేదన బాధ.. నేడు అభివృద్ధి జాడతో తీరింది
- రూ.3.40 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం
- ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు వసతి కల్పించాం
- శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం
- కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



2లో

## మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో యువతకు భరోసా

- పారిశ్రామిక రంగానికి అండగా కూటమి ప్రభుత్వం
- మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాక శుభ పరిణామం
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీకి తలమానికంగా ఆర్సెల్లార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్త భాగస్వామ్యంతో అనకాపల్లి నియోజకవర్గం, నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయడం యువతకు ఉపాధి భరోసా లభించినట్లు అయిందని రాష్ట్రన్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

లిఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటుతో లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష విధానంలో యువతకు ఉపాధి కలుగుతుందని బుధవారం అమరావతిలో ఏదైనా చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు అనుబంధంగా మిగతా 2లో...

## పర్యాటకులు పెరిగేలా ప్రణాళికలు



- బారువ నుంచి నెల్లూరు వరకూ బీచ్‌ల అభివృద్ధి
- పర్యాటకుల కోసం హోటళ్లు, హోంస్టేలు పెంచేలా కార్యాచరణ
- కారావాన్ పార్కులు... టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ
- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా ఏపీలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. మిగతా 2లో...

### ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో పర్యాటకశాఖ ఎంఓయూ



- ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం

2లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది.

## మహిళా సాధికారతకు పెద్దపీట



- మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి మరియు వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలను కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మద్దతుతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ ఇన్‌స్టిట్యూట్ లో ఏర్పాటు చేసిన "ఉద్యమి టు ఉన్నతి" – ఎగ్జిబిషన్ 2026ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఎగ్జిబిషన్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అరకు ఆర్గానిక్ మిల్లెట్స్, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద హస్తకళలు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు మరియు ఈవీ ఛార్జింగ్ వంటి సాంకేతిక ఆధారిత స్టాళ్లను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. మిగతా 2లో...

## బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈలోగా హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో రెండు నెలల తరవాత నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు చేరే నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హాస్టళ్లలోకి దోమలు రాకుండా దోమల నెట్ లు కిటికీలు, ద్వారాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడంలో మిగతా 2లో...

## వాట్సప్ మన మిత్ర ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు




- సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- రాష్ట్రంలో వృద్ధాప్య శాతాన్ని అధిగమించేందుకే సీఎం చంద్రబాబు నాయుడు పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీకి శ్రీకారం చుడుతున్నారు
- ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ, సీట్ల కేటాయింపు పటిష్టంగా అమలు చేయాలి
- వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది
- మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మన మిత్ర వాట్సాప్ ద్వారా రాష్ట్రంలోని వయో వృద్ధులకు ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందిస్తున్నామని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖామంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. మిగతా 2లో...



## వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్

- సింగపూర్‌తో ఏపీ చర్చలు
- సింగపూర్ ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్
- డేటా ఆధారిత పాలసీల దిశగా అడుగులు
- ఎగుమతుల పెంపు, పెట్టుబడుల ఆకర్షణపై మంత్రి వివరణ
- తీర ప్రాంత అభివృద్ధి, మత్స్య రంగంపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయం, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలపై విస్తృత చర్చలు
- ఫుడ్ సెక్యూరిటీ నుంచి లాజిస్టిక్స్ వరకూ.. సమగ్ర చర్చలు జరిపిన మంత్రి అచ్చెన్న

2లో

### పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న

## పీఎం ఆవాస్ యోజన



- ఇంటి కల నెరవేర్చిన ప్రధాని మోదీ సంకల్పం
- గృహ నిర్మాణంతో సామాజిక స్థిరత్వానికి బాటలు
- 'సబ్ కా సాథ్'తో ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు
- పీఎం ఆవాస్ యోజనతో విశాఖ అభివృద్ధికి కొత్త దిశ
- ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా విశాఖపట్నం జిల్లా అభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుకుంటోందని ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఈ పథకం కింద వేలాది పేద కుటుంబాల గృహ కలలు సాకారమవుతున్నాయని ఆయన తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో మొత్తం 1,39,501 ఇళ్లకు మంజూరు లభించగా, అందులో 24,852 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 77,335 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాకుండా, వేలాది కుటుంబాల ఆశలు, భవిష్యత్తుకు ప్రతీకలని అన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పేద కుటుంబాలకు భద్రత, గౌరవప్రదమైన జీవితం అందిస్తున్నదని, ప్రతి ఇటుకలో ఆశ, అభివృద్ధి ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా 2లో...

## అమరావతికి రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత !



(మొదటి పేజీ తరువాయి)

**కూటమి ప్రభుత్వంతో మళ్లీ ఊపిరి :** 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతికి మళ్లీ ఊపిరి వచ్చింది. భారీ నిధులతో అభివృద్ధి పనులు పునఃప్రారంభమయ్యాయి. భవిష్యత్తులో ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు లేకుండా విభజన చట్టంలో సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

**ప్రస్తుతం అదే దిశగా చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి.:**

**విభజన చట్టంలోని నిబంధనలు**

సెక్షన్ 5(1): పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించవచ్చు.

సెక్షన్ 5(2): ఆ గడువు అనంతరం తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా కొనసాగి, ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పడాలి.

సవరణ ద్వారా "కొత్త రాజధాని" స్థానంలో "అమరావతి"ని స్పష్టంగా పేర్కొననున్నారు.

వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు

అమరావతి నగర అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. దేశ విదేశాల పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతూ వివిధ సంస్థలు ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. డేటా సెంటర్లు సహా అనేక ప్రాజెక్టులు ప్రతిపాదన దశలో ఉన్నాయి.

రాజధాని విస్తరణలో భాగంగా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసింది. తుళ్లూరు మండలంతో పాటు పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని గ్రామాల్లో భూముల సమీకరణకు రైతుల నుంచి సానుకూల స్పందన లభించినట్లు అధికారులు తెలిపారు.

**సీఆర్డీఏ-2014 సవరణకు రంగం సిద్ధం :** చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా సీఆర్డీఏ-2014 తీర్మానంలో సవరణలు చేయాలని కేంద్రం సూచించింది. పీఎంఓ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తాజా తీర్మానం ప్రవేశపెట్టనుంది.

ఈ క్రమంలో 28న జరిగే ప్రత్యేక సమావేశం అమరావతి భవిష్యత్తుకు కీలకంగా మారనుంది.

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో పర్యాటకశాఖ ఎంఓయూ



(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు– ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ లు సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఏపీ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో యువతకు భరోసా



(మొదటి పేజీ తరువాయి)

రూ. 11, 198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు అవుతుండడం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న సరళీకృతమైన విధానాలే కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు మేలు కలుగుతుందన్నారు.

లిపారిశ్రామిక పెట్టుబడులకు నవ్యాంధ్ర అన్ని విధాలుగా అనుకూలంగా మారిందన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించడం జరుగుతుందన్నారు. విశాఖను ఐటీ హబ్ గా తీర్చిదిద్దేందుకు విద్య,ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు ఎంతో సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు,మరెన్నో ప్రతిష్టాత్మక కంపెనీల రాకకు మార్గం సుగమం కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని అన్నారు. ముందుచూపుతో కూడిన ప్రణాళిక చంద్రబాబు సొంతమని అన్నారు. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్ ను ప్రథమ స్థానంలో నిలవడం ఖాయమన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు, మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక వేత్తలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతుల జారీ, పరిశ్రమలకు ఏర్పాటుకు అవసరమయ్యే భూ సేకరణకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చూసి పారిశ్రామిక దిగ్గజ సంస్థలు తరలి వస్తున్నాయని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. దేశానికే గర్వకారణంగా నిలిచే మిట్టల్ పరిశ్రమ తో 700 రకాలకు పైగా ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమైందని, ప్రజలందరూ కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# పర్యాటకులు పెరిగేలా ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)



2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం సూచనలు జారీ చేశారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హేవ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ :** రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

# వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ దేశ ప్రతినిధులతో బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి కీలక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్టివిటీ, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత వినియోగంపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ దేశం తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ దేశం అనుసరిస్తున్న ఆహార భద్రతా విధానాలు, నిల్వ పద్ధతులు, సరఫరా అనుబంధాల నిర్వహణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల సంరక్షణ చర్యలు, సమయానికి సరఫరా, సమర్థవంతమైన రవాణా నిర్వహణపై సింగపూర్ ప్రతినిధులు అమలు చేస్తున్న విధానాలను వారు వివరించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎగుమతుల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, పెట్టుబడుల ఆహ్వానం వంటి అంశాలపై మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతులకు లాభసాటి ధరలు అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. పబ్లిక్ పాలసీల రూపకల్పనలో సాధారణ ప్రజల అభిప్రాయాలను ఎలా సేకరిస్తారు, వాటిని ఎలా అమలు చేస్తారు అనే అంశంపై ఇరు పక్షాల మధ్య చర్చ జరిగింది. సింగపూర్ ప్రతినిధులు డేటా అనలిసిస్, యుటిలైజేషన్ ద్వారా పాలసీలను ఎలా రూపొందిస్తారో వివరించారు. ఈ విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేసే అవకాశాలపై మంత్రి ఆసక్తి వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత అభివృద్ధి, తీర ప్రాంత వ్యవసాయం, మత్స్య రంగానికి సంబంధించిన అవకాశాలు, తీర ప్రాంత మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చించారు. సింగపూర్‌లో అమలు చేస్తున్న ఆధునిక తీర అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కోల్డ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్ పై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆహార ఉత్పత్తుల నిల్వ, నాణ్యత పరిరక్షణ, నష్టాలను తగ్గించే విధానాలు, ఆధునిక కోల్డ్ చైన్ వ్యవస్థలపై ఇరు పక్షాలు ప్రశ్నలు అడిగి సమాధానాలు ఇచ్చుకున్నారు. ఈ రంగంలో సాంకేతిక సహకారం పెంపుపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారం, జ్ఞాన మార్పిడి, పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆధునిక వ్యవసాయ విధానాలు, సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆఫిషియో, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవమికి ముందే రాములోరికి గిరి ప్రదక్షిణ సుమమాల



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడటంతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా నెలిమర్ల నియోజకవర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గాన్ని బుధవారం వర్చువల్ గా పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. సీతారాముని పేట కూడలి నుంచి నీలాచలం కొండ వరకు రూ.3.40 కోట్ల ఉపాధి హామీ నిధులతో 3.70 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి , వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు లోకం మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "భారతదేశంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో రామతీర్థం ఒకటి. ఈ క్షేత్రంలో రామాయణ, మహా భారత కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. అంతటి పవిత్రత కలిగిన రామతీర్థం కొండ చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తే ముక్తిని పొందుతారన్నది భక్తుల నమ్మిక. అందుకే వైకుంఠ ఏకాదశి, శివరాత్రి పర్వదినాల్లో బోదికొండగా పిలుచుకునే రామతీర్థం గిరి చుట్టూ వేలాది మంది భక్తులు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకుంటారు.

**రాళ్లు, ముళ్ల కంపలతో భక్తులు ఇబ్బందిపడేవారు:** రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం గతంలో రాళ్లు, రప్పలు, ముళ్ల కంపలతో నిండి ఉండేది. గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు కష్టమైనా ఆ మార్గంలోనే నడిచేవారు. ఈ విషయాన్ని స్థానిక శాసన సభ్యురాలు లోకం మాధవి తోపాటు కొందరు భక్తులు నా దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆలయాల పవిత్రతను సంరక్షించే చర్యల్లో భాగంగా రామతీర్థం కొండ చుట్టూ రోడ్డు నిర్మించే బాధ్యతను భుజాన వేసుకున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 3.40 కోట్లు వెచ్చించి గిరిప్రదక్షిణ మార్గంలో బీటీ రోడ్డు నిర్మించాం. అధికారుల సహకారంతో శ్రీరామ నవమికి రెండు రోజుల ముందే రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం.

**20 నెలల్లో రూ. 40 కోట్లు వెచ్చించాం :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల పవిత్రతను కాపాడే చర్యల్లో భాగంగా గడచిన 20 నెలల కాలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సాస్కీ నిధులు రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్ల సౌకర్యం కల్పించాం. శివరాత్రికి ముందు శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం. ఈ రోజున రాములవారి భక్తుల కోసం రామతీర్థం గిరిప్రదక్షిణ రోడ్డుని అందుబాటులోకి తెచ్చాం.

**గత ప్రభుత్వ పాలనలో రాముల వారి విగ్రహానికి శిరచ్ఛేదం వేదన కలిగించింది :** గత ప్రభుత్వం హయాంలో ఇదే రామతీర్థం పుణ్యక్షేత్రంలో రాములవారి విగ్రహం శిరచ్ఛేదం చేస్తే కోట్లాది మంది హిందువు భక్తులు బాధకి గురయ్యారు. వారిలో నేనూ ఒకడిని. ఆ ఘటన తీవ్ర వేదన కలిగించింది. ఈ రోజున ఆలయానికి గిరి ప్రదక్షిణ మార్గాన్ని సుందరంగా నిర్మించడం ద్వారా స్వామిని ఈ రూపంలో సేవించుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. సంస్కృతి సంప్రదాయాలను కూటమి ప్రభుత్వం కాపాడుతుంది" అన్నారు.

# వాట్సప్ మన మిత్ర ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి డా. స్వామి అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్ 3 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై సమావేశంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మన మిత్ర వాట్సాప్ ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్నాం. అర్హులైన వారందరికీ ఈ కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వృద్ధాశ్రమాల్లో లైట్ వెయిట్ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ, సీట్ల కేటాయింపు పటిష్టంగా అమలు చేయాలి. వృద్ధులు, దివ్యాంగుల కోసం కలెక్టర్ కార్యాలయాల్లో లిఫ్ట్ సౌకర్యంతో పాటు వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నాం. 2036 నాటికి రాష్ట్రంలో ప్రతి 5 మందిలో ఒకరు వృద్ధుడు ఉంటారు. దీన్ని అధిగమించేందుకే సీఎం చంద్రబాబు నాయుడు పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీకి శ్రీకారం చుడుతున్నారు. వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ సూర్య కుమారి, డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న పీఎం ఆవాస్ యోజన



(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అమలు చేస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్" అనే నినాదం కేవలం మాటల్లో కాకుండా, కార్యరూపంలో కనిపిస్తోందని మాధవ్ స్పష్టం చేశారు.

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనివల్ల సమాజంలో ఆర్థిక, సామాజిక స్థిరత్వం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## మహిళా సాధికారతకు పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ చిన్నతరహా పరిశ్రమలను పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , B2B మరియు B2C మార్కెట్‌లతో అనుసంధానించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు ఆంధ్రప్రదేశ్‌లో "ప్రతి ఇంటికొక పారిశ్రామికవేత్త"ను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 'వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, ప్రతి కుటుంబంలో ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన మరియు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు వారి విజయగాథలను అడిగి తెలుసుకున్నారు. మెప్మా, డ్వాక్రా మహిళల భాగస్వామ్యం మరియు టెక్నాలజీ వినియోగంపై మంత్రి దుర్గేష్ ప్రశంసలు కురిపించారు.

## బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి



(మొదటి పేజీ తరువాయి)

భాగంగా గడువులోగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 10 ఎంజేపీ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఏ ఒక్క బీసీ బిడ్డ బడి బయట ఉండకూడదన్నారు. ఆదరణ 3.0 పథకం అమలుపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ కార్పొరేషన్ జీఎం భీమశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ స్థాపన దినోత్సవం, అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి



- **ఏపీ బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ స్థాపన దినోత్సవం (ఏప్రిల్ 6), భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14) వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్యకర్తలకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**స్థాపన దినోత్సవానికి ప్రత్యేక కార్యక్రమాలు :** ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో పార్టీ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. ఏప్రిల్ 6న ప్రతి కార్యాలయంలో జెండా ఆవిష్కరణతో పాటు, కార్యకర్తలు తమ ఇళ్లపై కూడా పార్టీ జెండా ఎగరవేసి, వాటి చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ 7 నుంచి 12 వరకు 'గావ్/బస్తీ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఇందులో భాగంగా పెద్ద నియోజకవర్గాల్లో కనీసం 50 గ్రామాలు, చిన్న నియోజకవర్గాల్లో 10 గ్రామాలను సందర్శించాలని తెలిపారు. ఈ సందర్శనల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, సీనియర్ కార్యకర్తల సన్మానం, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు, పార్టీ సిద్ధాంతమైన 'అంత్యోదయ', 'నేషన్ ఫస్ట్' భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

**అంబేడ్కర్ జయంతి వేడుకలు :** ఏప్రిల్ 13న అంబేడ్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం దీపోత్సవం చేపట్టాలని సూచించారు. ఏప్రిల్ 14న విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు, అన్ని కార్యాలయాల్లో రాజ్యాంగ ప్రవేశికను సామూహికంగా పఠించాలని తెలిపారు.

ఏప్రిల్ 20లోపు జిల్లా కేంద్రాల్లో అంబేడ్కర్ జీవితం, సామాజిక న్యాయంపై ఆయన చేసిన కృషి గురించి చర్చా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రజలకు వివరించాలని సూచించారు.

**ప్రత్యేక కమిటీల ఏర్పాటు :** ఈ కార్యక్రమాల సమన్వయం కోసం రాష్ట్ర స్థాయిలో 4–5 మంది సభ్యులతో, జిల్లా స్థాయిలో 2–3 మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేయాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## సీఎంకు స్వాగతం పలికిన నగర కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** బుధవారం గుంటూరు నగరానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు జిల్లా కలెక్టర్, గుంటూరు జిల్లా ఎస్పీ గుంటూరు నగర కమిషనర్ . ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

## శ్రీరామ నవమి శోభాయాత్రకు సన్నాహాలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీరామ ఉత్సవ సమితి తెలిపింది. ఈ మేరకు కొత్తపేట శివాలయం దేవస్థానంలో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో సమితి గౌరవాధ్యక్షులు కారం శెట్టి లోకేష్ గుప్తా వివరించారు.

గత ఎనిమిదేళ్లుగా నిరవధికంగా నిర్వహిస్తున్న శోభాయాత్రను ఈ ఏడాది తొమ్మిదవ సంవత్సరం మరింత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే యాత్ర పట్టాభిపురం, నగరంపాలెం, హిందూ కాలేజ్, హనుమాన్ సెంటర్, బస్టాండ్ రోడ్, పాత గుంటూరు హనుమాన్ దేవాలయం, జెండా టవర్ కన్యకా పరమేశ్వరి ఆలయం మీదుగా రామనామ క్షేత్రం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ శోభాయాత్రకు తెలంగాణ మెదక్ ఎంపీ రఘునందన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, తాళ్లయ్యపాలెం పీఠాధిపతి శివస్వామి ఆశీర్వచనాలు అందించనున్నట్లు తెలిపారు. నగరంలోని రామభక్తులు, హనుమాన్ భక్తులు, హిందూ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో సమితి సభ్యులు వేణుగోపాల్, చల్లా బ్రహ్మారెడ్డి, ఫణీంద్ర, జానకి, మహేష్, ప్రవీణ్, లక్ష్మణు, మధు, సుబ్బారావు, చరణ్, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవు : కేంద్రం

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవు అని బుధవారం కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. బుధవారం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పెట్రోల్ డీజిల్ ధరలలో ఎటువంటి పెరుగుదల లేదని, వాటి ధరలు పెరగవని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనే పుకార్లు నమ్మవద్దని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఇప్పటివరకు 26 రాష్ట్రాలకు 22 వేల టన్నుల వాణిజ్య ఎల్పిజిని కేటాయించామని, గత 25 రోజుల్లో 2.5 లక్షల కొత్త పిఎన్‌జి కనెక్షన్లు మంజూరు చేశామని సుజాత శర్మ తెలిపారు. కాగా, గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో గృహ అవసరాలు తీర్చుకొనుటకు.. పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా సౌకర్యం ఉన్నచోట వినియోగదారులు దానికి మారకుండా ఉంటే.. గృహాలకు అందించే వంటగ్యాస్ ఎల్పిజి సరఫరాను నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కొత్త ఉత్తర్వును జారీ చేసింది.

# పిడుగురాళ్ల భోదనాసుపత్రిలో 2026-27 నుంచి ప్రవేశాలు

- **త్వరలో వైద్య సేవలు కూడా ప్రారంభం**
- **సి.ఎం, మంత్రితో చర్చించిన తరువాత తేదీ ఖరారు**
- **ఏప్రిల్ 15 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**
- **అధికారులు, ఇంజనీర్లకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ స్పష్టీకరణ**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని నూతన ప్రభుత్వ భోధనాసుపత్రిలో ఏప్రిల్ 15 నుంచి ఔట్ పేషెంట్ (ఓ.పి) రోగులకు వైద్య సేవలను ప్రారంభించేందుకు వీలుగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్రవైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ,వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తో చర్చించిన తరువాత అధికారకంగా వైద్య సేవలు ప్రారంభ తేదీని ఖరారు చేస్తామని పేర్కొన్నారు. రానున్నరానున్న విద్యా సంవత్సరం (2026–27) నుంచి ఎంబిబిఎస్ లో ప్రవేశాలు జరుగుతాయని చెప్పారు. మంత్రి సత్య కుమార్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బోధన ఆసుపత్రి భవన నిర్మాణాల పురోగతిని బుధవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ఆ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కార్యదర్శి సౌరబ్ గౌర్ సివిల్ ఇంజనీర్లు, మున్సిపల్ కమీషనర్, ఆర్.డి.ఓ, ఇతర అధికారులతో సమీక్ష జరిపారు.

**ప్రతి వారం సమీక్షిస్తా:** సమీక్ష సమావేశంలో సౌరభ్ గౌర్ మాట్లాడుతూ..2026–27 విద్యా సంవత్సరంలో ఎంబిబిఎస్ లో 100 సీట్ల మంజూరు కోసం ఎన్ఎంసికి దరఖాస్తు చేసామన్నారు. దీనికి అనుగుణంగా ఎన్.యమ్.సి నియమించే కమిటీ ఇన్స్పెక్షన్ కోసం వస్తుందని చెప్పారు. ఈ ఇన్స్పెక్షన్ దృష్టిలో పెట్టుకుని మే నెలాఖరు నాటికి నిర్మాణాలను కాంట్రాక్టర్ తో పూర్తి చేయించాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఎన్.యమ్.సి మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు పూర్తి చేసేలా అందరూ దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. తాను ప్రతి వారం పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తానని వెల్లడించారు. మరోవైపు కళాశాల తరగతుల నిర్వహణకు తగ్గట్లు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలను డి.యమ్.ఇ, డి.హెచ్ అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓ.పి సేవలను ప్రారంభించిన అనంతరం వీలును బట్టి ఐ.పి లో కూడా రోగులకు సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంబిబిఎస్ ప్రవేశాలు పొందే విద్యార్థులకు హాస్టల్‌లో అన్ని రకాల సదుపాయాలు ఉండాలాని, ఏ విషయంలోనూ కొరత ఉండకూడదని స్పష్టం చేశారు.

**ట్రయల్ రన్.. :** అలాగే శానిటరీ, సెక్యూరిటీ, డైట్ ఇతర ఏజెన్సీల వారిని కూడా సిద్ధం చేయాలని వెల్లడించారు. ఆక్సిజన్ కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సేవల ప్రారంభంపై ఏప్రిల్ 1 తరువాత ట్రయల్ రన్ నిర్వహిస్తమన్నారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ నీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు మున్సిపల్ కమీషనర్, ఆర్.డి.ఓ సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రవేశ మార్గంలో రాష్ట్ర ప్రధాన రహదారికి ఇరువైపులా బస్ స్టాపులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో త్వరితగతిన పనులు పూర్తి చేసేలా కార్యదర్శి అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. బోధన ఆసుపత్రి నిర్మాణాలు, నియామకాలు, వైద్య సేవల పురోగతిని నిరంతరశీ సమీక్షించేందుకు డి.యమ్.ఇ కి చెందిన సీనియర్ అధికారులు వెంకటేశ్, రామన్ లను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డి.యమ్.ఇ రఘునందన్, డి.హెచ్ పద్మావతి, ఏ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సి.ఇ నెహ్రూ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుందరాచార్య, పల్నాడు డి.యం.హెచ్.ఓ రవి, ఇతరులు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశం నిర్వహణకు ముందు కార్యదర్శి నిర్మాణాల పురోగతిని నేరుగా సందర్శించినప్పుడు కార్యదర్శి కాంట్రాక్టర్లుకు పలు సూచనలు చేశారు. మే నెలాఖరు నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం జానపాడు ఉప ఆరోగ్య కేంద్రం పనితీరును కార్యదర్శి, కలెక్టర్ నేరుగా పర్యవేక్షించారు. యాప్ లో రోగుల వివరాల నమోదు ఎలా జరుగుతున్నదని సిబ్బందిని ప్రశ్నించారు. కామేపల్లిలోని హెల్త్ సెంటర్ 104ను పరిశీలించారు.

# పియం ఇ-బస్ సేవా ఫథకం పూర్తి స్థాయిలో వినియోగానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయండి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పియం ఇ-బస్ సేవా పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు అవసరమైన సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులను ఆదేశించారు.బుధవారం ఎపి సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన 3వ రాష్ట్ర స్థాయి శాంక్షనింగ్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పియం ఇ-బస్ సేవా పథకం కింద రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్టీసిలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఇ-బస్సులను ప్రవేశపెట్టేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆదిశగా తగిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు.మొదటి దశలో 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను ఆర్టీసీ అధికారులతో సమీక్షించారు.ఇంధన పొదుపు,కాలుష్య నియంత్రణ తదితర ప్రయోజనాలే లక్ష్యంగా ఇ-బస్సులను ప్రవేశ పెట్టనున్నారని తెలిపారు.ఈ బస్సులు నిర్వహణకు సంబంధించి ఆర్టీసీలోని డ్రైవర్లు సహా ఇతర సాంకేతిక సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.ఆర్టీసీ సంస్థ మరింత సమర్ధవంతంగా పని చేసేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

కాగా 2027 చివరి నాటికి 26 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 116 నగరాల్లో 10,000 ఎయిర్-కండిషన్డ్ ఈ-బస్సులను ప్రవేశపెట్టేందుకు పియం ఇ-బస్సు సేవా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 3 లక్షల నుండి 40 లక్షల జనాభా కలిగిన నగరాలు,పట్టణాల్లో రవాణా అవసరాలను తీర్చడానికి వీటిని ప్రవేశపెడుతున్నారు. ఈ-బస్సుల ప్రవేశంతో పౌరుల ప్రయాణ అనుభవం మెరుగుపడనుంది. ఈ మౌలిక సదుపాయాలను టైర్-2 మరియు టైర్-3 నగరాలకు ప్రయోజనం కలిగించే లక్ష్యంతో ప్రవేశపెట్టారు.

ఈ సమావేశంలో టిఆర్అండ్బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబు పియం ఇ-బస్సు సేవా స్కీమ్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేస్తూ రాష్ట్రంలో 11 నగరాల్లో విశాఖపట్నం, విజయవాడ, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కర్నూల్, కాకినాడ, రాజమహేంద్రవరం, కడప, తిరుపతి, అనంతపురంల లో మొదటి దశలో 750 ఇ-బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నాలు జరిగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే తిరుపతిలో 100 ఇ-బస్సులను నిర్వహించడం జరుగుతోందని మరన్ని అదనపు ఇ-బస్సులను అక్కడ నడిపేదుంకు కృషి జరుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో 12 ప్రదేశాల్లో ఇ-బస్సు సివిల్ మౌలిక సదుపాయాల కల్పనకు 129.51 కోట్ల రూ.ల అంచనాలు రూపొందించగా దీనిలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరించనున్నాయని వివరించారు. ఆర్టీసిలో 15 సంవత్సరాలు సర్వీసు చేసిన బస్సులను యేటా దశలవారీగా తొలగించి వాటి స్థానే ఇ- బస్సులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు.

ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండి బాల సుబ్రహ్మణ్యం,ఆర్ధికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోజ్, పరిశ్రమల శాఖ అదనపు సంచాలకులు రామలింగేశ్వర రాజు,ఆర్టీసీ ఇడిలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు నమ్మకమైనన సేవలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ది తెనాలి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ పురోభివృద్ధికి సమిష్టి కార్యాచరణతో కృషి చేస్తున్నామని, త్వరలోనే బ్యాంకు కార్యాలయాన్ని గ్రౌండ్ ఫ్లోర్ కు మార్చుకుని ఖాతాదారులను పెంచుకొని, బ్యాంకును లాభాల బాటలో నడిపిస్తామని బ్యాంకు పాలకమండలి చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ పేర్కొన్నారు.

స్థానిక కొత్తపేటలోని టీబి రోడ్ లో గల నెంబర్ 22, ది తెనాలి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకమండలి సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం బ్యాంక్ ప్రాంగణంలో నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంకు పురోభివృద్ధి కార్యాచరణ పై పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ 104 సంవత్సరాల చరిత్ర గల, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్, చిన్న మధ్యతరగతి వర్గాలకు, చిరు వ్యాపారులకు, రుణ పరపతి కల్పిస్తూ, డిపాజిట్లపై మెరుగైన వడ్డీ రేటు అందిస్తూ, ఖాతాదారులు మన్ననలు పొందుతున్న తీరును వివరించారు. 2025 ఆర్థిక సంవత్సరంలో మార్ట్ గేజ్ రుణాలు మూడు కోట్ల 65 లక్షల 50 వేల రూపాయలు, గోల్డ్ లోన్లు మూడు కోట్ల 35 లక్షల 5500, ఐదు కోట్ల 70 లక్షలు డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. రుణం తీసుకున్నవారు తిరిగి చెల్లించే కాల పరిమితి 15 సంవత్సరాలకు పెంచే కార్యాచరణ పై బ్యాంకు అధికారుల అనుమతులు కోసమై ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తద్వారా బ్యాంకు సేవలను విస్తృతం చేసే కార్యాచరణను వివరించారు. ఈ సమావేశంలో పాలకమండలి వైస్ చైర్మన్ అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కోశాధికారి కోట పున్నారావు, పాలకమండలి సభ్యులు, బ్యాంక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'సర్దుపోటు' కొనసాగుతుంది




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ వినియోగదారులకు సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) కొనసాగనున్నాయి. ట్రూఅప్, టారిఫ్ భారాలు మోపకపోయినా ఇంధన సర్దుబాటు భారాన్ని మాత్రం కొనసాగిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి వెంకటరామరెడ్డి, ఎపిఇఆర్‌సి కార్యదర్శి కృష్ణ, జాయింట్ డైరెక్టర్ రమణయ్యశెట్టి కర్నూలులో బుధవారం విడుదల చేశారు. ఏ వినియోగదారులకూ టారిఫ్ పెంపు లేదని, 2024–25 ట్రూఅప్ ఛార్జీల భారాన్ని కూడా నివారించామని తెలిపింది. అయితే ఇంధన సర్దుబాటు మాత్రం కొనసాగుతుందని వెల్లడించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో విధించిన ఇంధన సర్దుబాటు ఛార్జీలను వసూలు చేస్తామని ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ వసూలు చేయడం ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ గ్యాప్ కొంత తగ్గించుకుంటామని తెలిపాయి. కొన్నేళ్ల నుంచి వినియోగదారుల నుంచి ప్రతినెలా ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో ఎలాంటి విచారణ నిర్వహించకుండానే యూనిట్‌కు 40 పైసలకు మించకుండా వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇక నుంచి ఈ 40 పైసలకు పరిమితం కాకుండా ఎంతైనా పెంచి వసూలు చేసుకోవచ్చునని ఇటీవల నియంత్రణ మండలి ఉత్తర్వులు విడుదల చేసింది. విద్యుత్ టారిఫ్ పెంపుదల లేదని చెప్పినా వినియోగదారులకు ఈ సర్దుబాటు ఛార్జీల భారం మాత్రం పడుతుంది.

2026–27 ఆర్థిక సంవత్సరంలో డిస్కమ్‌లు ప్రతిపాదించిన రూ.17,508.17 కోట్ల రెవెన్యూ లోటును రూ.15,790.57 కోట్లకు అనుమతి ఇచ్చింది. ఈ లోటును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించింది. ప్రభుత్వం భరిస్తామన్న రూ.15,790.57 కోట్లలో 2024–25కు సంబంధించిన ట్రూఅప్ రూ.638.68 కోట్లు ఉంది. వాణిజ్య వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.12.25లను రూ.9.95లకు తగ్గించింది. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పి నుంచి 20 హెచ్‌పికి పెంచింది. సుమారు 22 లక్షల మంది వినియోగదారులకు డిబిటి కింద ఉచితంగా లేదా రాయితీ టారిఫ్ ఉంటుందని ప్రకటించింది. రెన్యూవబుల్ ఎనర్జీ పరికరాల తయారీని ప్రోత్సహించే సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమకు ప్రత్యేక క్యాటగిరిని తీసుకొచ్చింది. వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్స్, ప్రింటింగ్ ప్రెస్ వినియోగదారులను వాణిజ్య కేటగిరి నుంచి పారిశ్రామిక కేటగిరికి మార్చింది. పౌల్ట్రీ ఫారాల్లో క్యాప్టివ్ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ల కోసం యూనిట్‌కు రూ.5.85 టారిఫ్‌తో ప్రత్యేక సబ్ మీటర్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చింది.

# ఇరాన్‌కు ట్రంప్15 డిమాండ్లు!



**టెహరాన్, వాషింగ్టన్ :** గత నాలుగు వారాలుగా యుద్ధోన్మాదంతో వ్యవహరిస్తూ పశ్చిమాసియాలో దాడులు, ఘర్షణలను రగిల్చిన అమెరికా తాజాగా ఇరాన్‌తో కాల్పుల విరమణకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే ఆ కాల్పుల విరమణకు అమెరికా తనదైన 15పాయింట్ల ప్రణాళిక పేరుతో తన డిమాండ్ల జాబితాను పాక్ మధ్యవర్తుల చేతికిచ్చి ఇరాన్‌కు పంపింది. ఆ ప్రణాళిక ఇరాన్ చేతికి అందిందని బుధవారం పాకిస్తాన్ అధికారులు తెలిపారు. పేరుకు 15 పాయింట్లు అని వున్నా అందులో వున్నవన్నీ అమెరికా డిమాండ్లే. ఇరాన్ తప్పనిసరిగా అమలు చేయాల్సిన అంశాలే.

ఒకవైపు కాల్పుల విరమణకు ప్రతిపాదనలు పంపుతూనే మరోవైపు పశ్చిమాసియాకు అదనపు బలగాలను అమెరికా తరలిస్తోంది. ఇప్పటికే అక్కడ వున్న నావికా బలగాలకు మద్దతుగా మరిన్ని బలగాలను పంపుతోంది. ఇరాన్‌లో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా మరో 3వేలమంది సైనికులు అక్కడకు వెళతున్నారని వార్తలు వెలువ డ్డాయి. ఈ వారంలో యుద్ధాన్ని ముగించడానికి ఉద్దేశించి టెహరాన్‌తో ఫలవంతమైన చర్చలు జరిగా యని ట్రంప్ చెబుతున్నారు. అయితే ఇరాన్ మాత్రం ఆ వాదనలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోంది.

**ఆ 15డిమాండ్లు ఏమిటి ?:** 30రోజుల పాటు కాల్పుల విరమణ, నటాంజ్, ఇస్ఫాన్, ఫోర్డోల్లో అణు కేంద్రాలను ధ్వంసం చేయడం, ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని ఇరాన్ శాశ్వతంగా హామీ నివ్వడం వంటి డిమాండ్లు ఆ 15 పాయింట్ల ప్రణాళికలో వున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ వద్ద వున్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలన్నింటినీ అప్పచెప్పాలి, ఇరాన్ క్షిపణుల రేంజ్, వాటి సంఖ్యపై పరిమితులు విధించాలి, ప్రాంతీయ దేశాల ఇంధన సదుసాయాలపై దాడులు వెంటనే ఆపాలి, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలి. ఇవన్నీ ఇరాన్ చేస్తే ఇరాన్‌పై విధించిన అన్ని ఆంక్షలను తొలగిస్తామని ట్రంప్ చెబుతున్నారు.

**వారితో వారు చర్చలు జరుపుకుంటున్నారా ?.. ఎద్దేవా చేసిన ఇరాన్ :** ఇదిలా వుండగా తమతో చర్చలు జరుగుతున్నా యనంటూ అమెరికా చెబుతున్న వాదనలను ఇరాన్ మిలటరీ తోసిపుచ్చింది. అమెరికన్లు వారితో వారు చర్చలు జరుపుకుంటున్నట్లు వున్నారని ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఎద్దేవా చేశారు. ”మీరు ఒకప్పుడు వ్యూహాత్మక శక్తి అంటూ చెప్పుకొచ్చింది ఇప్పుడు వ్యూహాత్మక వైఫల్యంగా మారింది. ప్రపంచ అగ్రరాజ్యం సాధ్యమైతే ఈ సంక్షోభం నుండి బయటపడగలిగి వుండేది. కానీ మీ ఓటమిని ఒప్పందంగా మార్చడానికి ప్రయత్నించకండి. శుష్క వాగ్దానాల శకం ఇక ముగిసింది. మీతో మీరే మాట్లాడుకునే దశకు మీ అంతర్గత ఘర్షణలు చేరాయా?”అంటూ లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫాఘరి ఒక ప్రకటన విడుదల చేశారు. పాకిస్తాన్ ద్వారా ఇరాన్‌కు 15పాయింట్ల ప్రణాళిక పంపిన వెంటనే ఈ ప్రకటన వెలువడింది. ”మొదటి రోజు నుండి మా మాటలు ఒకలానే వున్నాయి. అవి మారలేదు. అయినా మాలాంటి వారు మీలాంటి వారితో సద్దుకు పోవడమనేది జరగదు. ఇప్పుడే కాదు, ఎప్పటికీ జరగదు.” అని స్పష్టం చేశారు. మంగళ వారం వరకు ఈ యుద్ధం కారణంగా ఇరాన్‌లో 1500మంది మరణించారు. 18వేల మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అమెరికా, ఇజ్రాయిల్‌పై పోరాటం సాగుతుందని ఇరాన్ మిలటరీ ప్రకటించింది. బుధవారం ఇజ్రాయిల్, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాలపై దాడులకు పాల్పడింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ తెలిపింది.

**కొనసాగిన దాడులు :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు బుధవారం కూడా కొనసాగాయి. టెహరాన్‌లోని ఇరాన్ రక్షణ శాఖ నిర్వహిస్తున్న నావికా దళానికి చెందిన క్రూయిజ్ క్షిపణి కేంద్రంపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ బుధవారం ప్రకటించింది. ఐడిఎఫ్ నిఘా వర్గాల సమాచారం మేరకు ఇజ్రాయిల్ వైమానిక దళం ఈ దాడులకు పాల్పడినట్లు మిలటరీ తెలిపింది. మరోవైపు బీరుట్‌పై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన దాడుల్లో ఆరుగురు మరణించారని లెబనాన్ మీడియా బుధవారం తెలిపింది. పాలస్తీనా శరణార్థుల శిబిరంలో ముగ్గురు, దక్షిణ సిడాన్ ఏరియాలో మరో ముగ్గురు మరణించారు.


**మధ్యవర్తిత్వానికి పాక్ ఎంపికెందుకు? :** పాకిస్తాన్‌ను మధ్యవర్తిగా ఎంపిక చేసుకోవడానికి వెనుక పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను శాంతి దూతగా పాకిస్తాన్ అభివర్ణించడం అందులో ఒక కారణం కాగా కీలకమైన ఖనిజాల ఒప్పందాన్ని అమెరికాతో కుదుర్చుకోవడానికి పాకిస్తాన్ ముందుకు రావడం మరో కారణంగా వుంది. అలాగే గాజా శాంతి బోర్డులో చేరడం కూడా వారి బంధాన్ని మరింత బలపరిచింది.

పాకిస్తాన్ మధ్యవర్తిత్వ యత్నాల గురించి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం సౌదీ యువరాజు ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌కు వివరించారు. అంతకుముందు అమెరికా, ఇరాన్‌ల మధ్య అర్ధవంతమైన చర్చలు జరిగేలా చూసేందుకు పాకిస్తాన్ సిద్ధంగా వుందని షరీఫ్ ఎక్స్ పోస్టులో తెలిపారు. కొన్ని గంటల తర్వాత ట్రంప్ దాన్ని తన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.



## రోళ్ళపాడులో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**కర్నూలు, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మిడుతూరు మండలం, రోళ్ళపాడు గ్రామంలోని శ్రీరామాలయం నందు ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ధర్మప్రచారకులు కె. సిద్దారెడ్డి శ్రీరామ పట్టాభిషేకంపై ఉపన్యసించారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలను నిర్వహించారు. తితిదే ఇలాంటి కార్యక్రమాలను మారుమూల గ్రామాలలో కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని సర్పంచ్ పేరెడ్డి వేంకట రామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాలు మంగళవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు ఉపన్యాసం, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ నాగారెడ్డి రామస్వామి రెడ్డి, ధర్మప్రచారకులు బొంతు రామ్మోహన్, ధర్మప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎన్.చిన్న నారాయణ, అర్చకులు టి.మనోహర్ శర్మ, ఇ. వెంకటేశ్వర్లు గౌడు, ఇ. నారాయణ గౌడు, యోగి ఎల్లయ్యతో పాటు భజన మండలి సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**జగ్గయ్యపేట, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

జగ్గయ్యపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందింది. వారి వైద్య ఖర్చులను స్థానిక నాయకులు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తులు చేయించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి మొత్తం ?10,34,567 (పది లక్షల ముప్పై నాలుగు వేల ఐదు వందల అరవై ఏడు)ను మంజూరు చేసింది. మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం తన నివాసంలో బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కట్టా వెంకట నరసింహారావు, దర్శి విజయ నరసింహారావు, మండల సమైక్య అధ్యక్షురాలు నాయిని రజని, పసుపులేటి శ్రీనివాసరావు, మారేపల్లి శౌరి, షేక్ సుభాని, షేక్ నాగుల్ మీరా, షేక్ బడే మియా, పల్లెబోయిన నాగరాజు, మల్లెబోయిన జ్వాల, కొత్తపల్లి రాజు, గుమ్మ మధు, బాణావతు రవి, మూడు రాంబాబు, గండు కిషోర్, గుడారు నాగార్జున, గుమ్మ వెంకటేష్, గుగులోతు హుస్సేన్, ఆళ్లూరి రమణ, ఇమ్మడి వెంకట్, కరిసే రవి, షేక్ మాబు మియా తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడులో జాబ్ మేళా నిర్వహణ

**నూజివీడు, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**



ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నారు. శ్రీ శారద డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 11 కంపె నీల ప్రతినిధులు పాల్గొని సుమారు 925 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బి.ఫార్మసీ, బి.టెక్ తదితర కోర్సులు పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. వివరాల కోసం 83740 39719, 9491694228 నంబర్లను లేదా టోల్ ఫ్రీ నంబర్ 9988853335 ను సంప్రదించవచ్చు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా మరియు సర్టిఫికేట్ల జిరాక్స్ ప్రతులతో తప్పనిసరిగా హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

## ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్న అంకెం ఇందిరా ప్రియదర్శిని



**జి.కొండూరు, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ లోని ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో నేడు వేగుళ్ల లీలా కృష్ణ చైర్మన్ అధ్యక్షతన జరిగిన ఏపిఎస్ఐడిసి బోర్డ్ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు , ప్రభుత్వ అధికారులు, డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని సహచర డైరెక్టర్ల తో కలిసి పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమం లో చిన్ననందిగామ గ్రామ పరిధిలో 1000 ఎకరాల ఆయకట్టు కు కావలసిన నూతన పంప్ హౌస్ గురించి అంకెం ఇందిరా ప్రియదర్శిని ,చైర్మన్ కి, మేనేజింగ్ డైరెక్టర్ కి వివరించి వినతి పత్రం అందజేయటం జరిగింది ఈ కార్యక్రమం చెరువు ప్రసిడెంట్, సెక్రటరీ డైరెక్టర్ లు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

- సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా ప్రచారం కల్పించాలి
- తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామోహన్

**విజయవాడ, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

సౌరశక్తి వినియోగంపై ప్రజలల్లో అవగాహన పెంపొందిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపేందుకు పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహనకు సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు.

నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ), నెడ్ క్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో సూర్యాంధ్ర ప్రగతి రథాలను విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మంగళవారం అశోక్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన కార్యక్రమం 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అని, ప్రతి ఇంటి పైన సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే అతి తక్కువ ఖర్చుతో మనం ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. మనకు అయ్యే ఖర్చు సుమారు 4 నుండి 6 ఏళ్లలో కరెంట్ బిల్లుల ఆదా ద్వారా తిరిగి వచ్చేస్తుందన్నారు. అనంతరం 20 ఏళ్ల పాటు మనం ఉచితంగా విద్యుత్ పొందే అవకాశం ఉంటుందన్నారు.



ఈ రోజున ఏ ఇంటికి వెళ్లినా కరెంట్ బిల్లు ప్రధానమైన భారంగా మారుతోందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలుకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. ప్రకృతి నుంచి, సూర్యుడి నుంచి శక్తిని గ్రహించి సోలార్ ప్లేట్ల ద్వారా ఎనర్జీని ఇచ్చే గొప్ప కార్యక్రమం ఇది అని అన్నారు. దీనివల్ల కాలుష్యం కూడా ఉండదన్నారు. విద్యుత్ ప్లాంట్ల వల్ల బొగ్గు పొగ వల్ల వచ్చే కాలుష్యం మన ఊపిరితిత్తులపై ఎంత ప్రభావం చూపుతుందో మనం ఆలోచించుకోవాలన్నారు. ఈ పథకంలో క్రింద ప్రభుత్వం పలు సబ్సిడీలను అందిస్తోందన్నారు. ?70 వేల నుండి ?80 వేల వరకు ఖర్చయ్యే ప్లాంట్‌పై ?30,000 సబ్సిడీ ఉంటుందన్నారు. షెడ్యూల్ కులాలు తెగల వర్గాలకు నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నారన్నారు. వారికి ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. బీసీలతో పాటు అందరికీ ఇందులో సబ్సిడీలు వర్తిస్తాయన్నారు.

**వ్యక్తిగతంగా లబ్ది పొందా... ప్రజా ప్రతినిధిగా నా అనుభవం...**

తన వ్యక్తిగత అనుభవానికి వస్తే తనకు గతంలో నెలకు వేల రూపాయల విద్యుత్ బిల్లు చెల్లించేవాడినని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నాక ఇప్పుడు ?4,000 నుండి ?5,000 వరకు బిల్లు తగ్గిందన్నారు. ఇందుకు సుమారు ?6 లక్షలు వరకు ఖర్చు చేశానన్నారు. దీనివల్ల నెలకు ?18,000 చొప్పున ఏడాదికి లక్షకు పైగా ఆదా అవుతోందన్నారు. ఇలా మూడు నుండి నాలుగు సంవత్సరాలలో నేను పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేస్తుందన్నారు. నేను వ్యక్తిగతంగా లబ్ధి పొందాను కాబట్టి, ఒక శాసనసభ్యునిగా, ప్రజా ప్రతినిధిగా అందరూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మాట్లాడుతూ... సూర్యాంధ్ర ప్రచార ప్రగతి రథాల ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్, నెడ్ కాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ మౌలాలి పాల్గొన్నారు.

## రైతుల ఆర్థిక అభ్యున్నతి ప్రభుత్వం లక్ష్యం

- మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్

**మైలవరం, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో రూ.10 లక్షల వ్యయంతో పశువుల వసతిశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో, కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మైలవరం నియోజకవర్గం, మైలవరం మండలం, సి.ఆర్ నగర్‌లో నిర్మించిన పశువుల వసతిశాలను మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందని ఈ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గంనకు పశువుల వసతిశాలను ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోడం తో పాటుగా, పశు గ్రాస అభివృద్ధికి హరిత గోపాలం పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఏం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద



పశు గ్రాసం సాగును ప్రోత్సహిస్తూ, పశు గ్రాస క్షేత్రాలు మరియు మేత నర్సరీల ఏర్పాటునకు ఆర్థిక సహాయం చేయడం మన రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న గొప్ప వరాలని, పాడి రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని నిర్వహణ ఖర్చులు మరియు దాణా ఖర్చులు గణనీయంగా తగ్గించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ పథకాలను మంజూరు చేసినం దుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి, మరియు ఈరోజు ఈ పశువుల వసతిశాలను ఏర్పాటు చేయుటకు సహకరించిన పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కి, శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల గాంధీ , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి విజయ్ బాబు , మైలవరం మండల అధ్యక్షులు గోపాల స్వామి , మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంకా లితీష్ , పాల సంఘ అధ్యక్షులు, మండల కూటమి నాయకులు, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లకు కూలింగ్ క్యాన్లు బహుకరించిన కన్నా

**మైలవరం, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని ఐదు అంగన్వాడీ సెంటర్లకు గురిజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) పది వాటర్ కూలింగ్ క్యాన్లను మంగళవారం జరిగిన కార్యక్రమంలో బహుకరించారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీ సెంటర్లలో ఉంటున్న చిన్నారులకు, సిబ్బందికి తాగునీటి సౌకర్యం నిమిత్తం కూలింగ్ క్యాన్లు అందించాలని వారం రోజుల క్రితం సిడిపిఓ కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) ను కోరారు. ఇందుకు స్పందించిన కోడూరు మనోజ్ కుమార్ (కన్నా)ఒక్కొక్క అంగన్వాడి సెంటర్ కు రెండు కూలింగ్ క్యాన్ల చొప్పున ఐదు సెంటర్లకు 10 కూలింగ్ క్యాన్లను మంగళవారం సిడిపిఓకు అందజేశారు. ఈ



సందర్భంగా గురజాల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడూరు మనోజ్ కుమార్ (కన్నా) మాట్లాడుతూ చిన్నారుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సిడిపిఓ అడిగిన వెంటనే కూలింగ్ క్యాన్లను బహుకరించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రతిరోజు ఐదు సెంటర్లలో కూలింగ్ వాటర్ ను కూడా తానే సరఫరా చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేగాక ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా సెంటర్లలోని చిన్నారులు, సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ఎయిర్ కూలర్లు సమకూర్చమని సిడిపిఓ అభ్యర్థించారని, 10 రోజులలో ఒక్కొక్క సెంటర్కు ఒక్కొక్క ఎయిర్ కూలర్ ను సమకూరుస్తానని హామీ ఇచ్చారు. వెల్వడం గ్రామంలోని 5 అంగన్వాడీ సెంటర్లలో చిన్నారుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తానని ఆయన స్పష్టం చేశారు. కాగా కోడూరు మనోజ్ కుమార్ దాతృత్వానికి సిడిపిఓ మరియు అంగన్వాడీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

- సిపిఐ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి

**గన్నవరం, మార్చి 25 (జర్నలిస్ట్ ఫైల్)**

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇవ్వాలి అని గన్నవరం నియోజకవర్గ సమితి కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమేండ్ చెసారు మంగళవారం . సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు గన్నవరం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గన్నవరం యం అర్ ఒ కార్యాలయంలో డ్యూప్యూటీ యం అర్ ఒ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టియు మాజీ అధ్యక్షులు పెద్దు వెంకట రత్నం మాట్లాడుతూ పేద ప్రజలు ఎన్నికలో ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు.రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో బ్రతకడానికి అవకాశం లేక పట్టణ ప్రాంతాల్లో ఉండాలి ఇక్కడ కూలి నాలి పనులు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ప్రాంతాలకు వస్తున్న ప్రజలకు స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు కమ్యూనిస్టు పార్టీగా అడుగుతున్నాం రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇల్లు స్థలాలు ఇవ్వాలి. చంద్రబాబు నాయుడు కి మరియు జగన్మోహన్ రెడ్డికి ఇల్లు కట్టుకోవడానికి ఎకరాల ఎకరాలు కావలి కానీ పేదలకు మాత్రం రెండు మూడు సెంట్లు కూడా ఇవ్వరా అని మండిపడ్డారు. ప్రభుత్వ భూము 99 పైసలకు



కంపెనీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు.పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు..10 సంవత్సరాలు కావస్తుంది టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు డీడీలు చెల్లించి నేటికి వాటిని వారికి స్వాధీనం చేయలేదు తక్షణమే డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ టిడ్కో ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి రామచంద్ర జోషి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం జనవరి క్యాలెండర్ ఇస్తామని ఇంతవరకు ప్రకటించలేదని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు భవిష్యత్తులో పేద ప్రజలకు కష్టాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శనగల సుబ్బారెడ్డి, కట్టవరపు విజయ రావు, చాగంటి పాటి వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి నూతక్కి రామ్మోహన్రావు సభ్యులు ,తిరువీధి నాగేశ్వరావు,చాగంటి పాటి భవాని ప్రసాద్,కట్టేవరపు మోహన్ రావు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలన



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజా వాకింగ్ ట్రాక్‌ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ & బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కె.వి. శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ భాషా బుధవారం ఉదయం పరిశీలించారు. కాజా వాకింగ్ ట్రాక్‌తో పాటు ఎన్ఆర్ఐ సమీపంలోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో జరుగుతున్న పార్కుల అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులు నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. నగరంలోని పార్కుల పనులను వేగంగా పూర్తి చేసి, అందంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలాకృష్ణప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు, ఉద్యాన అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో మెరుగైన వసతులు కల్పించాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో మెరుగైన వసతుల కల్పనకు జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, అక్షయపాత్ర సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అన్న క్యాంటీన్ సూపర్వైజర్లు, జిఎంసి నోడల్ అధికారులతో సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల నిర్వహణపట్ల అధిక శ్రద్ధ చూపుతుందని, నగరంలోని 7 అన్న క్యాంటీన్లలో 3 రోజుల్లో మైనర్ రిపేరులు పూర్తి చేయాలని జిఎంసి ఇంజినీరింగ్ అధికారులను, క్యాంటీన్ల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. క్యాంటీన్లలో ట్యాప్ లు, లైట్లు, సీలింగ్ మరమత్తులను ఎప్పటికప్పుడు చేపట్టాలని, అన్ని క్యాంటీన్లలో వర్షానికి, ఎండలకు ఇబ్బంది లేకుండా షెడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దం చేసి తమకు పంపాలని ఎస్ఈని ఆదేశించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు ఆహార సరఫరా సమయంలో క్యాంటీన్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడి, ఏమైనా సమస్యలు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలన్నారు. క్యాంటీన్ కి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహారం అందేలా ఇండెంట్ తెప్పించుకోవాలని అక్షయపాత్ర సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో జిఎంసి సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఉపా సెల్ పిఓ సింహాచలం, అన్న క్యాంటీన్ జిల్లా కోఆర్డినేటర్ గోపాల్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని చేద్దాం

- నేటి బిఆర్ స్టేడియంలో మల్టీ పర్పస్ భవన శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి
- పార్టీ శ్రేణులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ పండుగకు సిద్ధం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కేడర్ కు పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రేపు 26న బిఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవన సముదాయాల శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులతో బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు నేలపై పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ను ప్రపంచ పటంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాకే తెలుగు ప్రజలు తలెత్తుకొని నిలబడేలా ఆత్మ గౌరవాన్ని కాపాడినట్లు చెప్పారు. అలాంటి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ స్టేడియం అభివృద్ధి కోసం అసెంబ్లీలోనూ ప్రస్తావించానని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బిఆర్ స్టేడియం అభివృద్ధికి బాటలు వేశామని స్పష్టం చేశారు. ఖేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 14 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటి ద్వారా మల్టీపర్పస్ భవన నిర్మాణాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని, ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## గుంటూరు నగరంలో పార్కులు, సెంట్రల్ డివైడర్లు పచ్చదనంతో ఉండాలి

- సిబ్బందిని ఆదేశించిన నగర కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్క్ లు, సెంట్రల్ డివైడర్లు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, పార్క్ ల నిర్వహణలో స్థానిక కమిటిలను భాగస్వాములను చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఎస్ఈ, ఏడిహెచ్ లకు స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో పార్క్ ల అభివృద్ధి, నగరంలో పచ్చదనం పెంపుపై ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏడిహెచ్ శాంతిలతో కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 32 పార్క్ లను, సెంట్రల్ డివైడర్లలో పచ్చదనం పెంపు ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రత్యేక దృష్టి చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్ ల వారీగా వాకింగ్ ట్రాక్ మరమత్తులు, మొక్కలు, ఇతర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. పార్క్ ల అభివృద్ధిలో స్థానికంగా ఉండే వాకర్స్ అసోసియేషన్లు లేదా ఇతర సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. డివైడర్లలో చాలా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని, వాటిని తొలగించి, ప్రస్తుత వేసవి సమస్యలు రాకుండా నీటిని అందించాలన్నారు. ఇప్పటికే రోడ్ల వెంబడి నాటిన మొక్కలు ఎక్కడైనా ఎండిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు.

## ఇంటింటికి సురక్షితమైన తాగునీరుపై ఎంపీడీఓ సమీక్ష సమావేశం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** మండలంలో ప్రతి గ్రామంలో 2028 నాటికీ ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ఆశయమని ఎంపీడీవో రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ నీటి భద్రతా ప్రణాళిక శిక్షణ కార్యక్రమం పై మండలంలోని సర్పంచులు ఎంపీటీసీలు వార్డు మెంబర్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పరిపాలన అధికారి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పుట్టా సొంత అడ్డాలో బస్ షెల్టర్ లేక భక్తుల ఇబ్బందులు

- నాయకుల మధ్య విభేదాలు ఇందుకు కారణమా ?
- బస్ షెల్టర్ కట్టాలంటే ప్రసాదం స్కీమ్ చూపెట్టడం కరెక్టా ?




**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ సొంత మండలమైన బ్రహ్మంగారి మఠం స్తానిక జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానం ప్రాంగణంలో బస్ షెల్టర్ లేక మండల ప్రజలు స్వామివారి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఎన్నిమార్లు ఎమ్మెల్యే పుట్టా దృష్టికి తీసుకెళ్లినా కూడా ఎందుకు బస్ షెల్టర్ నిర్మించలేదు అని స్థానిక ప్రజల ప్రశ్న. మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ అంటే అభివృద్ధి ప్రదాత కార్యకర్తలకు ఎటువంటి సమస్య రాకుండా చూసుకునే నాయకుడు నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు మైదుకూరు నియోజకవర్గం ను ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తున్న ప్రజా నాయకుడు బ్రహ్మంగారి మఠం మండలం లో మోడల్ గురుకుల పాఠశాల మరియు నవోదయ పాఠశాలను మంజూరు చేయించిన నాయకుడు ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. మరి ఇంత అభివృద్ధి చేసే ఎమ్మెల్యే పుట్టా సొంత మండలంలో ఒక బస్ షెల్టర్ లేదు అంటే,భక్తులు స్తానిక ప్రజలు,తెలుగు దేశం పార్టీ అభిమానులు ఏమనుకోవాలి, ఎలా అర్థం చేసుకోవాలి.

**నాయకుల మధ్య విభేదాల వల్లే బస్ షెల్టర్ నిర్మించలేదా ?**

బ్రహ్మంగారి మఠం మండలం లోని నాయకుల మధ్య ఉన్న విభేదాల వల్లనే బ్రహ్మంగారి మఠం లో బస్ షెల్టర్ నిర్మించలేదు అని ప్రజలు, పార్టీ కార్యకర్తలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. బ్రహ్మంగారి మఠం మండలం తెలుగు దేశం పార్టీ నాయకుల ఒకరి వర్గం ఒకచోట బస్ షెల్టర్ ఏర్పాటు చేద్దాము అంటారు. ఇంకొక వర్గం ఇంకొక చోట ఏర్పాటు చేద్దాము అంటారు. ఇలా ఒకరికొకరు పంతాలకు పోయి మా మాట నెగ్గాలి అని పంతం పట్టి చివరకు భక్తులను, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. పార్టీ అధికారంలోకి రాగానే మేమే నాయకులం, మాకే అన్ని కాంట్రాక్ట్ పనులు కావాలి అని తీసుకొని, కమీషన్లకు వర్కులు అమ్ముకుంటూ తన సొంత ప్రయోజనాలు చూసుకుంటూ ఉన్న ఈ నాయకులు ప్రజలకు నిత్యం ఉపయోగపడే బస్ షెల్టర్ నిర్మించలేకున్నారు అని ప్రజలు బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు.

**నాయకులు చెప్పారు సరే ఎమ్మెల్యే పుట్టా ఎందుకు ఆలోచించలేదు** :బ్రహ్మంగారి మఠం లో బస్ షెల్టర్ నిర్మాణం గురించి ప్రజలు మరియు పలు పత్రికలలో ఎన్నో మార్లు వచ్చినప్పటికీ మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఎందుకు బస్ షెల్టర్ నిర్మించడం లేదు అనేది పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. బ్రహ్మంగారి మఠం మండల నాయకులు వారి స్వలాభం కోసమో లేక వారికి నచ్చిన కార్యకర్తల కోసమో బస్ షెల్టర్ నిర్మాణం విషయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు ఏవేవో మాటలు, సాకులు చెప్పి ఉండవచ్చు, కానీ బస్ షెల్టర్ నిర్మాణం అనేది ప్రజలకు స్వామి వారి భక్తులకు ఎంత అవసరం అనేది ఎమ్మెల్యే పుట్టా ఎందుకు ఆలోచించడం లేదు, కేవలం నాయకులు చెబితేనే బస్ షెల్టర్ నిర్మాణం చేస్తారా, ప్రజల మరియు భక్తుల బాధలు అర్థం చేసుకోలేరా అని స్తానిక ప్రజలు బాధను వ్యక్తం చేస్తున్నారు.

**వేసవికాలం వచ్చింది కనుకరించండి ఎమ్మెల్యే పుట్టా సర్**

వేసవికాలం వచ్చింది, ఎండలు బాగా ఎక్కువై ఎక్కడ ఉండాలో తెలియడం లేదు, ఏ కూల్ డ్రింక్స్ షాపు పక్కనో, కిరాణా కొట్టు పక్కనో నిలబడాలి అంటే వారు ఏమంటారో, ఏమి మాట్లాడుతారో అని బాధపడుతూ, ఎండలో ఉండలేక చేసేది ఏమి లేక మనసు చంపుకొని బస్ వచ్చేవరకు అక్కడే నిల్చొని వెళ్లాల్సిన పరిస్తితి వచ్చింది. కాబట్టి మా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టి పెట్టి, నాయకుల మాటలు పట్టించుకోకుండా అధికారులకు చెప్పి వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలని బ్రహ్మంగారి భక్తులు స్తానిక ప్రజలు నమస్కరిస్తూ కోరుకుంటున్నాము అని తెలిపారు.

# ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్ల కీలక పాత్ర వహించాలి

- ప్రైవేటు బ్యాంకులు పనితీరు మెరుగుపరుచుకోవాలి
- డీసీసీ, డీఎల్ఆర్ఎస్ సమావేశంలో అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకర్ల పాత్ర చాలా కీలకమని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకర్లు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని డి.ఆర్.సి సమావేశ మందిరంలో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపులు కమిటీ సమావేశం (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం (డీఎల్ ఆర్ఎస్) సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. సమావేశంలో ఎజెండాకు సంబంధించి కౌలు రైతు రుణాలు, పశుసంవర్ధక శాఖ ద్వారా పశుపోషణకు రుణాలు, ప్రాధాన్యత రంగాలు విద్యా రుణలు, ఎస్ఎంఈ రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఒన్ ఫ్యామిలీ ఒన్ ఎంటర్ప్రెన్యూర్ రుణాలు, పీఎం ముద్ర యోజన, పి యంఈజిపి, పీఎం స్వానిధి, కిసాన్ డ్రోన్స్, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ తదితర పథకాలకు సంబంధించి రుణాల మంజూరుకు జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలు, బ్యాంకులవారీగా సాధించిన లక్ష్యాలపై బ్యాంకర్లతో, అధికారులతో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ కౌలు రైతు రుణాలు ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు ప్రైవేటు బ్యాంకులు అందించాలన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో ముందంజలో ఉన్నాయని, ప్రైవేటు బ్యాంకులు కౌలు రైతు రుణాలతో సహా విద్యా రుణాలు, గృహ రుణాలు ఇతర ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరులో ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదన్నారు. స్వానిధికి సంబంధించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అప్లికేషన్లు బ్యాంకులకు సమర్పించేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సూర్యఘర్ కు సంబంధించి వెండర్స్ కు ఇబ్బంది లేకుండా మంజూరు చేసిన రుణాలు బ్యాంకర్లు వెంటనే జమ చేయాలన్నారు. దీనిపై బ్యాంకర్లు, వెండర్లు, విద్యుత్ శాఖ అధికారులతో లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి ఇబ్బందులు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సూర్య ఘర్ కు దరఖాస్తులు రావడం తగ్గిందన్నారు. 89 వేలు సబ్సిడీ ఇస్తున్నారని , డి.ఆర్.డి.ఎ మెప్మా అధికారులు వెండంర్స్ కు అవగాహనా కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో ముందంజలో ఉన్నాయని ప్రైవట్ రంగ బ్యాంకుల సైతం రుణాల మంజూరులో పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ బ్యాంక్ లలో దాదాపు 149 కోట్ల రూపాయలు అన్‌క్లెయిమ్డ్ అమౌంట్‌లు ఉన్నాయని, ఇందులో 120 కోట్లు ప్రజలకు సంబంధించినవని తెలిపారు. ఈ అన్‌క్లెయిమ్డ్ అమౌంట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించి , అర్హులైన వారిని గుర్తించి, వారికి పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వ రంగా బ్యాంక్ లు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో ముందంజలో ఉన్నాయని, ప్రైవేట్ బ్యాంక్ లు ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు రుణాలు మంజూరులో వెనుకబడి యున్నాయని, పనితిరు మెరుగుపరచుకోవాలని సూచించారు. యునియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజినల్ హెడ్, డి.సి.ఎం జవహర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరు మరింత మెరుగు పరచేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా అభివృద్ధికి బ్యాంక్ ల తరుపున పూర్తీ సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడిఎ పద్మావతి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీందర్, మెప్మా పిడి విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖ అధికారి పీ. కిరణ్ కుమార్ , డి.ఐ.సి.సి.ఐ కే. పావని నాబార్డ్ డీడీఎం జి శరత్ బాబు, ఆర్బిఐ ఎల్డిఓ నవీన్, ప్రభుత్వ , ప్రైవేటు రంగ బ్యాంకుల ప్రతినిధులు, కంట్రోలర్లు పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, భర్త గళ్ళా రామచంద్రరావు గారితో కలిసి దర్శించుకున్నారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారితో పాటు టీడీపీ కార్పొరేటర్లు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ తిరుమలలో స్వామివారి దర్శనం పొందడం ఎంతో అదృష్టకరమని, ప్రజల ఆశీర్వాదాలతో మరింత సేవ చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, గుంటూరు అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని, స్వామివారి ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

## పలు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు మెరుపు దాడి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** విజిలెన్స్ అధికారులు బ్రహ్మంగారిమఠంలోని హోటళ్ల పై మెరుపు దాడులు నిర్వహించారు. మూడు హోటల్లోని 6 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో వాడాల్సిన డోమేస్టిక్ గ్యాస్ సిలిండర్లను వ్యాపార సముదాయానికి వాడుతున్నారనే సమాచారం తెలియడంతో ఈ తనిఖీలు చేసామన్నారు. ఈ గ్యాస్ సిలిండర్ల వాడకంపై పూర్తిగా అవగాహన లేని మాపై అకస్మాత్తుగా దాడులు చేయడం చాలా దారుణమని హోటల్ యజమానులు వాపోతున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంట్లో వాడవలసిన సిలిండర్లను వ్యాపార సముదాయాలలో వాడకూడదని వాటిని కమర్షియల్ గానే వాడాలని ఆయన తెలిపారు అలా వాడని ఎడల చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## అనుమానస్పద వ్యక్తుల కదలికలపై సబ్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ విచారణ



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల టౌన్ పరిధిలోని తెలుగుగంగ కాలనీ సమీపంలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు అని స్థానిక ప్రజలు సమాచారం ఇవ్వగా సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ మరియు వారి సిబ్బంది మరియు బ్రహ్మంగారి మఠం మండల తెలుగు దేశం పార్టీ నాయకులు యస్ ఆర్ శ్రీనివాసులు రెడ్డి కలిసి ఆ గ్రామస్తులను విచారించి రాత్రి వేళలో పోలిస్ నిఘా ఏర్పాటు చేస్తామని మీకు ఏదైనా అవసరం ఉంటే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ గ్రామస్తులకు తెలిపారు.

## మఠాధిపతుల చేతుల మీదుగా మాల ధారణ



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారిమఠం లోని మహా నివేదిన మందిరంలో బుధవారం నూతన మఠాధిపతులు పూజ్య శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారి చేతుల మీదుగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మాల వస్త్రాలు పూజా సామాగ్రి అందించడం జరిగింది. అనంతరం స్వామివారు వారికి మంత్రోచ్ఛారణ మధ్య భక్తులకు మాలా ధారణ మెడలో వేశారు. మాల ధారణ వేసుకున్న స్వాములందరూ కూడా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మూలమంత్రాన్ని అనునిత్యం జపిస్తూ ఉండాలని మరియు మాలాధారణకు సంబంధించిన నియమ నిష్టల గురించి స్వామి వారు తెలియజేశారు. ఈ మాలాదారణ వస్త్రాలు పూజా సామాగ్రి కోనేటి వీర నాగరాజు పసుపులేటి వెంకటసుబ్బయ్యలు ఉచితంగా అందించారు.


INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రామాలయ పునఃప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణం కొప్పురావుకాలనీలో నూతనంగా రామాలయ పునఃప్రతిష్ట మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ఉదయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య హనుమత్ లక్ష్మణ సీతాసమేత రాముల వారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం స్వామివార్లను దర్శించుకుని మంత్రి లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం పునర్ నిర్మాణానికి మంత్రి లోకేష్ రూ. 5 లక్షల విరాళం అందించారు. శ్రీ సీతారామస్వామి కోవెల సందర్శన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పాత మంగళగిరిలో కొలువై ఉన్న శ్రీ సీతారామస్వామి కోవెలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు ఆలయ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేష్ సీతారామస్వామి వార్లను దర్శించుకుని ఆశీర్వాచనాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఆవిర్భావ దినోత్సవవేళ, రైతులకు ఆటవిడుపుగా...



- వ్యవసాయ మార్కెట్ యార్డులో కోలాహలం ఆరంభం

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ఆరుగాలం పంటలు పండించే కార్యాచరణలో శ్రమించే రైతులకు ఆటవిడుపుగా ఈనెల 29నుండి ఏప్రిల్ 4వరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రైతుకు ఉల్లాసం, ఉత్సాహం, విజ్ఞానం, వినోదం కలగలసిన వైభవం. స్వర్గీయ ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ నిర్వాహణలో, జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్లబల ప్రదర్శన, ఆవుల పాలప్రదర్శన, లేగదూడల అందాల ప్రదర్శనలకు నెలవు కానున్నది. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు. ఈక్రమంలో బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాంగణంలో డయాస్ ఏర్పాట్లను, రైతులకోసం ఏర్పాటు చేస్తున్న గ్యాలరీని పరిశీంలించారు. ఈక్రమంలో కార్రక్రమాలను పర్యవేక్షిస్తున్న స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మీడియాతొ మాట్లాడుతు ఒంగోలుజాతి ఎడ్లబల ప్రదర్శన పోటీలు ఓకార్యాచరణగా ఇప్పటివరకు 8సార్లు నిర్వహించామని, 9వ, సారి నిర్వహించే ఎడ్లబల ప్రదర్శన పోటీలు, తెనాలి, వేమూరు నియోజక వర్గాల రైతులకు ఆట విడుపుగా ఈనెల 29న వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం వేదికగా ప్రారంభం కానున్న వేడుకలను, రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి వర్యులు నాదెండ్ల మనోహర్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత, ట్రైబల్ వెల్ ఫేర్ మినిష్టర్ గుమ్మడి సధ్యారాణి, పోటీల కన్వీనర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అతిధులుగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనలు 7విభాగాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులతొపాటు, పది కన్సోలేషన్ బహుమతులున్నాయన్నారు. పార్టీలోని సీనియర్లను స్మరించుకుంటూ వారి పేర్లు పలు విభాగాలకు పెడుతున్నట్లు తెలిపారు. ఎంతొ ప్రతిష్టగా భావించి శ్రమిస్తున్న కార్యవర్గం, పార్టీ శ్రేణుల సంయుక్త కృషితొ పోటీలు ఏప్రిల్ 4వరకు కొనసాగు తున్నాయన్నారు. మనది అనేభావంతొ శ్రమిస్తున్న శ్రేణులు కృతజ్ఞతలని, ఎక్కడా ఎలాంటి కొరత లేనివిధంగా ప్రతి అంశాన్ని కులంకషంగా పరిశీలిస్తు రైతుల ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు.

## ఆంధ్రప్రదేశ్ 'ప్రకృతి వ్యవసాయ' క్షేత్రాలను పర్యటించనున్న నేపాల్ ప్రతినిధి బృందం

- 27 నుండి మూడు రోజులపాటు పర్యటన

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రదేశ్ ప్రజా బాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం విధానాలను అధ్యయనం చేయడానికి నేపాల్ దేశానికి చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ నెల 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు గుంటూరు , ఏలూరు జిల్లాల్లో పర్యటించనుంది. పర్యటనలో భాగంగా మొదటి రోజు గుంటూరులోని రైతు సాధికార సంస్థ కార్యాలయంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ కుమార్ తో బృందం సమావేశమవుతుంది. ప్రకృతి వ్యవసాయంలో కమ్యూనిటైజేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్, మార్కెటింగ్, హెల్త్ న్యూట్రిషన్ వంటి అంశాలపై ఆయా విభాగాల నిపుణులు బృందానికి అవగాహన కల్పిస్తారు. మధ్యాహ్నం అతోట గ్రామంలో 9 సూత్రాల అమలు, కమ్యూనిటి రిసోర్స్ పర్సన్స్ సభ్యులతో భేటీ బాపయ్య విత్తన ఉత్పత్తి క్షేత్రాన్ని బృందం సందర్శించనుంది. రెండవ రోజు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలంలోని గుండుగొలనుగుంట గ్రామంలో బృందం పర్యటిస్తుంది. ఇక్కడ బయో-ఇన్పుట్ రిసోర్స్ సెంటర్ సందర్శించి బీజామృతం, ద్రవ జీవామృతం, అగ్ని అస్త్రం వంటి కాషాయాల తయారీని పరిశీలిస్తారు. మహిళా సంఘాలు రైతు శాస్త్రవేత్తలతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించనున్నారు. చివరి రోజు గుంటూరు జిల్లా ఎరుకలపూడిలో జొన్న పంట క్లస్టర్లను రైతు భరోసా కేంద్రాలను సందర్శిస్తారు. రోశయ్య 'ఐదు అంచెల' ప్రకృతి వ్యవసాయ నమూనాను పరిశీలించిన అనంతరం, ఆర్ వై ఎస్ ఎస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గారితో సమీక్షా సమావేశంలో పర్యటన అనుభవాలను పంచుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ నమూనాలను, క్షేత్రస్థాయిలో రైతుల జీవన ప్రమాణాల్లో వస్తున్న మార్పులను నేపాల్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యం. ఈ పర్యటనను అగ్రికల్చర్ ఆఫీసర్ వి. నాగ ప్రమీల రాణి మరియు ఎన్.ఆర్.ఓ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఎస్. దాదాపీర్ పర్యవేక్షిస్తున్నారు.

## రాష్టంలో మొదలైన పారిశ్రామిక చైతన్యం కూటమి పాలకుల ముందుచూపుకు నిదర్శనం

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రాభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో, స్వదేశీ,విదేశీ కంపెనీలను స్వాగతించి, వారి ప్రయోజనాలకు తగుప్రోత్సాహమిస్తూ, కొత్త పరిశ్రమలు ఏర్పాటుకోసం, రాష్ట్రవిద్యా,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిని వివరిస్తు ప్రశంశించారు. ప్రతి నియోజక వర్గంలొఎమ్మెస్ ఎంఎల్ ఏర్పాటుచేసి ఆ ప్రాంత నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశాలు పరిశీలించే విధానం అభినందనీయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు ధీటుగా,ఆర్సెలార్ మిట్టల్, నిసాన్ సంయుక్తంగా అతి పెద్ద ఉక్కు పరిశ్రమ స్థాపనకు ఉత్తరాంధ్రలో చేపడుతున్న ఏర్పాట్లను వివరించారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్మెంట్ కార్యాచరణకు ఇస్తున్న ప్రాధాన్యత ద్వారా యువతను తీర్చిదిద్దుతున్న తీరును కొనియాడారు. ఇప్పటికే రాష్ట్రంలొ 6లక్షల81వేల ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా లోకేష్ బాబు నిత్య శ్రామికుడులా కృషి చేస్తున్న తీరును వివించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి నారాలోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతొ,గతంలో చూడని అభివృద్ధిని, నేడు చూస్తున్నామని ఇదో శుభపరిణామం అన్నారు. ఈ మీడియా సమావేశంలోపట్టణ టిడిపి అద్యక్షులు కుధ్దూస్, నియోజక వర్గ యువత అద్యకులు కోగంటి రోహిత్, నాగేశ్వ్రరావు, కుదరవల్లిశ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్ తదితరపార్టీ శ్రేణులు ఉన్నారు.

## మంత్రి నారా లోకేష్‌కు ఏపీ ఎన్జీజీఓ సంఘం కృతజ్ఞతలు

- పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయంపై ఉద్యోగుల తరపున ధన్యవాదాలు
- పీఆర్‌సీ కమిటీ నియామకంపైనా త్వరితగతిన నిర్ణయం తీసుకోండి
- కమిషన్ ఏర్పాటులో జాప్యంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం
- పదవి విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిని చెల్లించాలి
- మంత్రి నారా లోకేష్‌కు ఎ. విద్యాసాగర్, జేఏసీ నేతలు విజ్ఞప్తి





**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ మంత్రుల బృందం (జీవోఎం) తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగులకు ఆర్థిక భద్రతను కల్పించడమే కాకుండా, వారి సేవలను మరింత కాలం వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు.

విద్యాసాగర్ నేతృత్వంలోని జేఏసీ, ఎన్‌జీవో నేతలు బుధవారం మంత్రి నారా లోకేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. జీవోఎంలో సభ్యునిగా సానులకూల నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు సంబంధించిన చైల్డ్ కేర్ లీవ్ ఓయో పరిమితి నిబంధన సదలించటం మహిళా ఉద్యోగులందరికీ ఆనందదాయకంగా ఉందని మహిళ ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కొక్కటిగా పరిశ్రమల తరలివస్తున్నాయని, ముఖ్యంగా 1,26 వేల కోట్లు ఏర్పాటు చేయబోయే మిట్టల్ ఉక్కు కర్మాగారం రాష్ట్రానికి తలమానికంగా ఉంటుందని, దీనికి విశేషకృషి చేసిన మంత్రి నారా లోకేష్ గారికి జోక సంఘాల నేతలు అభినందనలు తెలిపారు.

ఉద్యోగులకు సంబంధించిన కీలక అంశమైన పీఆర్‌సీ కమిటీ నియామకంపైనా ప్రభుత్వం దృష్టిసారించాలని.. కమిషన్ ఏర్పాటు జాప్యం కారణంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీఆర్‌సీ కమిటీని వీలైనంత త్వరగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దశాబ్దాల తరబడి సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యుటీ, సరెండర్ బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సరెండర్ బిల్లుల చెల్లింపులు జరగకపోవడం వల్ల వారిలో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి బకాయిలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెకండరీ ఎడ్యుకేషన్, హైయర్ ఎడ్యుకేషన్ తదితరు డిపార్ట్మెంట్లో ఎయిడెడ్ సంస్థల నుంచి వచ్చిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ తయారు చేయాలని, తద్వారా ప్రమోషన్ లభిస్తాయని కోరారు. మంత్రి నారా లోకేష్ ను కలిసిన వారిలో ఏపి ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ విద్యాసాగర్ తో పాటు జేఏసి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ కె.ఎస్.ఎస్ ప్రసాద్, ఎన్జీజీఓ రాష్ట్రసంఘ ప్రధాన కార్యదర్శి డివి రమణ, ఎన్జీజీఓ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.జగదీశ్వరరావు ఎన్.భారతి ప్రసాద్ జి.శ్రీనివాస్ ఆర్ ఎస్ హరనాథ్ బి.జానకి ఎం.సరస్వతి ఎం.రాజ్యలక్ష్మి పి.సురేఖ షేక్ జాని ఫాషా తదితరులు ఉన్నారు.

## ఎస్ఆర్ఎంలో అమరరాజా సెంటర్ విస్తరణ

- రెండో దశ సనులకు కీలక ప్రతిపాదనలు
- వర్సిటీ ప్రొఫెసర్లతో సమావేశమైన ఆమరరాజా బృందం



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** బ్యాటరీస్ తయారీలో అగ్రగామిగా పేరుగాంచిన అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్ అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఉన్న ఎనర్జీ స్టోరేజ్ డివైజస్ సెంటర్ ను విస్తరించేందుకు ముందుకు వచ్చింది. 2020లో యూనివర్సిటీ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎనర్జీ స్టోరేజ్ డివైజెస్ సెంటర్ లో పరిశోధనలను విస్తృతపర్చడమే కాకుండా ఇప్పటి పరిశ్రమలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సమాయత్తమవుతోంది. ఈ మేరకు ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రొఫెసర్లు సిద్ధం చేసిన కీలక ప్రతిపాదనలపై సమక్షించింది.
బుధవారం ఉదయం యూనివర్సిటీకి విచ్చేసిన అమరరాజా సాంకేతిక బృందం యూనివర్సిటీలోని అమరరాజా సెంటర్ నిర్వహణ బాధ్యతల్లో ఉన్న ప్రొఫెసర్లతో సమావేశమైంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి. నారాయణరావుల పర్యవేక్షణలో జరిగిన ఈ కీలక సమావేశంలో రెండో దశ కింద సెంటర్ను అభివృద్ధి పరిచే అంశాలపై సమగ్రంగా చర్చించారు.
ఈ సందర్భంగా వీసీ సతీష్ కుమార్ యూనివర్సిటీ ప్రత్యేకతను, ఇక్కడ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. అమరరాజ సెంటర్ పనితీరును ప్రశంసించి దానిని అభివృద్ధి పరిచే విషయంలో సమగ్ర సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు అమరరాజా ఎనర్జీ స్టోరేజ్ సెంటర్లో పరిశోధనలు కొనసాగిస్తున్న ప్రొఫెసర్లను అమరరాజా బృందానికి పరిచయం చేసి వారు చేస్తున్న పరిశోధనలను వివరించారు. ఈ సందర్భంగా రెండో దశ ఆబ్జక్టివ్ లను వెల్లడించారు. బ్యాటరీల్లో ఎలక్ట్రో థర్మల్ మోడల్ డెవలప్మెంట్, ఎన్ఎంసీ టైపు బ్యాటరీ మెటీరియల్స్ రిసైక్లింగ్ వంటి అంశాలపై మరింత పరిశోధనలు జరిపి పరిశ్రనులకు అనుగుణంగా అయా టెక్నాలజీని చేరువ చేయాల్సిన అవసం ఉందన్నారు.
ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ మారం పార్థసారథి, డాక్టర్ సుజిత్ కల్లూరింతో పాటు పలువురు రీసెర్చ్ ప్రొఫెసర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి రీసెర్చ్ మరియు 2వ దశ ప్రతిపాదనలను వివరించారు. ఈ సమావేశంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్ నుంచి డాక్టర్ ఇషహాప్ హాన్, డాక్టర్ రవి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుశోజన్, డాక్టర్ భువనేశ్వర్, డాక్టర్ ప్రిసిల్లా గ్రీసు పాల్గొన్నారు.

## రూరల్ డెవలప్మెంట్ ట్రస్టుకు ఎఫ్.సి.ఆర్.ఎ అనుమతి లభించడం శుభపరిణామం

- పేదల సంక్షేమానికి సరికొత్త ఉత్తేజం
- నల్లపల్లి విజయ్ భాస్కర్ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ కి కేంద్ర ప్రభుత్వం నుండి తిరిగి ఎఫ్ సి ఆర్ ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) అనుమతి లభించడం పట్ల ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ హర్షం వ్యక్తం చేసారు. ఈమేరకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు గారికి పత్రికాముఖంగా కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ఈ అనుమతి లభించడం ద్వారా అంతర్జాతీయ దాతల నుండి నిధులను స్వీకరించడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని, సంస్థ చేపడుతున్న విద్యా, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలు మరింత వేగంగా, విస్తృతంగా కొనసాగే అవకాశం ఏర్పడింది అని అన్నారు.
అనంతపురం జిల్లాతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో ఆర్డీటీ చేస్తున్న సేవలకు ఈ నిర్ణయం వెన్నుముకగా నిలుస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు అందుతున్న ఉచిత వైద్య సేవలు, వికలాంగుల పునరావాసం మరియు నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఈ నిధులు ఎంతో దోహదపడతాయని అన్నారు.
ఆర్డీటీ సంస్థ పాటిస్తున్న పారదర్శకతకు, సామాజిక నిబద్ధతకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ అనుమతి ఒక నిదర్శనమని అన్నారు. సామాజిక బాధ్యత కలిగిన సంఘంగా ఆర్ డి టి కి ఎఫ్ సి ఆర్ ఎ అనుమతులు కల్పించాలని తాము 06.01.2026 నాడు గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి లేఖ పంపిన విషయాన్ని గుర్తుచేశారు.

## వడ్డీ రాయితీతో పన్ను చెల్లించడానికి 6 రోజులే గడువు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏక మొత్తంగా చెల్లించే ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా వినియోగించుకుంటున్నారని, బుధవారం ఒక్కరోజే రూ. 2.55 కోట్లు పన్ను చెల్లించారని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పన్ను బకాయిల చెల్లింపుపై బకాయిదారుల నుండి మంచి స్పందన ఉందన్నారు. ఇప్పటికే నోటీసులు, మెసేజ్ లు పంపి బకాయిదారులకు తాము చెల్లించాల్సిన బకాయిపై అవగాహన కల్గించామని, చెల్లింపుదారులకు వీలుగా అదనపు కౌంటర్ల ఏర్పాటు కూడా చేశామని తెలిపారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారు బకాయిలపై స్పందించకుంటే చట్ట ప్రకారం సీజ్ లేదా జప్తులకు సిద్దం చేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించామని తెలిపారు. చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించని వారి ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాక్స్ కలెక్షన్ కేంద్రాలు కూడా ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వంకు పని చేస్తాయని, నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది మీరే

- వైకాపాపై ఘాటుగా విమర్శలు చేసిన ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.9.74 లక్షల కోట్లు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారిందనేది అక్షరాలా నిజం! 2019లో అధికారం చేపట్టినప్పటి నుంచి 2024లో గద్దెదిగేదాకా... ఏటేటా అప్పుల కొండ పెరుగుతూనే ఉందని, జీఎస్ డీపీలో అప్పుల వాటా 36 శాతానికి చేరిందని నాడు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) తన నివేదికలో పేర్కొనడం నిజం కాదా? అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సాక్షి పత్రికలో వాస్తవాలను వక్రీకరిస్తూ "అప్పుల మోత" అంటూ ప్రచారం చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. కాగ్ నివేదికను మలచి చూపించడం కాదు.. అసలు లెక్కలు మాట్లాడితే నిజం బయటపడుతుంది జగన్! అని మోహనకృష్ణ ధ్వజమెత్తారు. ఈ మేరకు గుంటూరులోని తన కార్యాలయం నుంచి బుధవారం ఆయన ఒక ప్రతికా ప్రకటన విడుదల చేశారు. "2024--25 కాగ్ నివేదికలో చూపిన రూ. 81,071 కోట్ల అప్పు మొత్తం.. జూన్ 12వంకు అధికారంలో ఉన్న మీ వైసీపీ ప్రభుత్వ కాలంలో తీసుకున్నదే కదా? ఒక్క ఏప్రిల్-మే నెలల్లోనే రూ. 27,205 కోట్ల అప్పు తీసుకుని వెళ్లిన నువ్వు... ఇప్పుడు మొత్తం అప్పును కూటమిపై నెట్టడం ఎంత వరకు సమంజసం? మీ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంపై రూ. 9.74లక్షల కోట్లు అప్పు భారం పెట్టి తప్పుకుంటే దశలవారీగా చెల్లిస్తుంది కూటమినే అనేది వాస్తవం కాదా జగన్? ఆర్బీఐ ద్వారా రూ. 4.38 లక్షల కోట్లు, కార్పొరేషన్ల ద్వారా రూ. 2.48 లక్షల కోట్లు, పబ్లిక్ అకౌంట్ సుమారు రూ. 80 వేల కోట్లు -ఈ భారీ అప్పులన్నీ రాష్ట్రంపై మోపింది మీరే... కాంట్రాక్టర్లు, పథకాల పెండింగ్ బిల్లులు రూ. 1.13 లక్షల కోట్లు, ఉద్యోగుల బకాయిలు రూ. 21,980 కోట్లు, డిస్కామ్ ఉ సివిల్ సప్లైస్ బాకీలు సుమారు రూ. 70 వేల కోట్లు. ఈ భారాన్ని వదిలి వెళ్లింది మీ పాలనే కదా జగన్? ఐదేళ్లలో రూ. 3 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశామని చెబుతూ... కార్పొరేషన్, గ్యారంటీ, ఆఫ్-బడ్జెట్ అప్పులను దాచిపెట్టడం మీకే చెల్లింది కదా జగన్? మీ పాలనలో తీసుకున్న ఆఫ్-బడ్జెట్ అప్పుల వల్లే రాష్ట్రం ఇప్పుడు రోజుకు దాదాపు రూ. 100 కోట్ల వడ్డీ చెల్లించే పరిస్థితి నెలకొంది. అసలు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన మొదటి పనే.. మీరు వదిలి వెళ్లిన అప్పులు తీర్చడం.. గత 9 నెలల్లోనే సుమారు రూ. 71,880 కోట్ల అప్పులు క్లియర్ చేసి, వెండర్లకు రూ. 25 వేల కోట్ల వరకు చెల్లింపులు చేసింది కూటమి ప్రభుత్వం. ఖజానాలో మినిమమ్ బ్యాలెన్స్ లేకుండా, నియంత్రణలేని అప్పులు చేసి, ఆస్తులు సృష్టించకుండా వదిలింది మీ వైసీపీ పాలనే.. అప్పులు చేసి అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది మీరే.. ఇప్పుడు ఆ భారాన్ని తగ్గిస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం న్యాయమా జగన్? నిజాలు చెప్పే ధైర్యం ఉంటే వాటిని ప్రజలకు తెలియజేయండి.. అంతేకానీ కాగ్ నివేదికను వక్రీకరించి ప్రజలను మభ్యపెడితే మీకే నష్టం." అని మన్నవ మోహనకృష్ణ హితవు పలికారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467